క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బేతంచెర్ల: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులవుతారని అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, మధురవాణి, రమణమ్మ, అరుణ కుమారి, నరసమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని బైటిపేట అంగన్‌వాడీ కేంద్రం–2లో 1,2,3,4, 5 అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రామ్‌కో సిమెంట్ యూనిట్‌హెడ్ రెడ్డినాగరాజు అన్నారు. గనుల మంత్రిత్వశాఖ, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ శాఖ ఆదేశాల మేరకు శనివారం కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ప్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద స్వచ్ఛతపై సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అక్టోబర్ 2వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరిసరాల శుభ్రత, మొక్కల పెంపకం, విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన, పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్‌హెడ్ రామరాజు, మైన్స్ జీఎం అబ్జుల్ అహ్మద్, వీపీ వెంకట్రామన్, ఏపీపీ సూర్యకాంత్, జీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన ఆంజనేయులు శర్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వమ్మకు శనివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులను సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, అర్చకులు ఉన్నారు.

దుగ్గిరెడ్డి కుటుంబానికి కాటసాని పరామర్శ



దుగ్గిరెడి రవీంద్రనాథ్ రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: అవుకు మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి సుబ్బారెడ్డి (80) ఈ నెల 7వ తేదీ మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దుగ్గిరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బారెడ్డి కుమారుడు, అవుకు మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డికి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వినతి



మంత్రి ఫరూక్‌కు సమస్యను విన్నవిస్తున్న అధ్యాపకులు

కోవెలకుంట్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జేఏసీ నాయకుడు అబ్దుల్ జబ్బార్ కోరారు. ఈ మేరకు శనివారం నంద్యాలలో న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,619 మంది ఒప్పంద అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేసిందని, అలా కాకుండా 114 జీఓ ప్రకారం ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరారు. సంఘం నాయకులు శివగంగ ప్రసాద్, శివశంకర్, చెన్నుడు పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై భారం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం అయితే మెడికల్ సీట్లు ఎక్కువగా మేనేజ్‌మెంట కోటాలో చేరుతాయి. దీని వల్ల పేద కుటుంబాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు వైద్య విద్య భారంగా మారుతుంది. ప్రైవేటీకరణ చేస్తే మధ్య తరగతి పిల్లలు మెడిసిన్ చదడం చాలా కష్టంగా మారుతుంది. గత ప్రభుత్వం తెచ్చిన మెడికల్ కాలేజీలను యథావిధిగా కొనసాగించాలి.

–బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, బేతంచెర్ల



సీటు వస్తుందనే ఆశతో కోచింగ్ ఇప్పిస్తున్నా



మా పిల్లలను ఎంబీబీఎస్ చదివించాలనే కోరికతో ఏడాదికి రూ.5 లక్షలు ఖర్చు పెట్టి లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పిస్తున్నాం. గత ప్రభుత్వం నూతన మెడికల్ కాలేజీలను తీసుకురావడంతో ఎంతో సంతోషపడ్డాం. పిల్లలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోనే సీటు వస్తుందని ఆశగా ఎదురుచూశాం. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ కాలేజీ నిర్మాణాలను నిలిపివేయడం దారుణం. ఈ నిర్ణయం వల్ల పిల్లల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అయినట్లే.

–శేఖర్, విద్యార్థి తండ్రి, డోన్

- కూటమి ప్రభుత్వంలో రైతన్నకు పెట్టుబడి సాయం దూరం
- ఎన్నికల ముందు రూ.20వేలు ఇస్తామని హామీ
- అధికారంలోకి వచ్చాక ఊసెత్తని ప్రభుత్వం
- జగనన్న హయంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం

అందని భరోసా



పొలంలో వ్యవసాయం చేస్తున్న రైతు

డోన్ రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలకుపైనే గడుస్తోంది. పంటల సాగుకు పెట్టుబడి సాయం అందక రైతులు అల్లాడిపోతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఏటా రూ.20 వేల చొప్పున ప్రతి రైతుకు అందిస్తామని ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలవుతున్నా ఆ ఊసే లేదు. వైఎస్సార్‌సీపీ హయంలో ఏటా సీజన్ ప్రారంభం కాగానే రైతు ఖాతాలో నగదు జమ అవుతుండేది. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అన్నదాతలకు అండగా నిలిచారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 అందజేసి ఆదుకున్నారు. 2019 నుంచి వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. డోన్ నియోజకవర్గంలో బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాల్లో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 2019 నుంచి 2024 వరకు 1,72,596 మంది రైతులకు రూ.233 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. సున్నా వడ్డీ రాయితీ ద్వారా 2021 రబీ నుంచి 2024 రబీ వరకు 22 వేల మంది రైతులకు రూ.17 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు.

పెట్టుబడి సాయం అందక అవస్థలు

తాము అధికారంలోకి రాగానే రైతులకు సాగు పెట్టుబడి కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ఊరావాడా తిరిగి ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి మూడు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు చిల్లిగవ్వ రైతులకు అందించలేదు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ప్రభుత్వం పెట్టుబడి సాయం గురించి మాట్లాడడం లేదు. మరోవైపు బ్యాంకులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ రుణ ప్రణాళిక అందడం ఆలస్యం కావడంతో రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేయలేదు.

హామీ నిలబెట్టుకోవాలి



అధికారంలోకి వస్తే పంటల సాగుకు రూ.20వేలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊరూవాడా ప్రచారం చేశారు. దీన్ని నమ్మి రైతులు ఓట్లు వేశారు. సీజన్‌లో పెట్టుబడికి డబ్బులు లేవు. గత్యంతరం లేక పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోంది.

–రాంకుమార్ యాదవ్, వెంకటనాయునిపల్లి గ్రామం

పెట్టుబడి సాయం ఏదీ?



ఖరీఫ్ సీజన్ ముగిస్తున్నా కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై నోరు మెదడపడం లేదు. గత ప్రభుత్వం హయంలో సీజన్‌కు ముందే రైతు భరోసా అందించి రైతులను ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులపై చిన్నచూపు చూస్తోంది. పంటల సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

–సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్, డోన్

మెగా జాబ్‌మేళా వాయిదా

బనగానపల్లె: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న జరగాల్సిన మెగా జాబ్‌మేళాను వాయిదా వేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, దస్తగిరి శనివారం తెలిపారు. అనివార్య కారణాలతో వాయిదా పడిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

పులిదామోధర్‌కు భారత్ సేవారత్న అవార్డు

డోన్ టౌన్: పట్టణానికి చెందిన బార్ కౌన్సిల్ మాజీ కోశాధికారి పులి దామోధర్‌కు బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ భారత్ సేవా రత్న అవార్డు ప్రదానం చేసింది. సమాచార హక్కు చట్టం జిల్లా హైలెవల్ కమిటీ సభ్యుడిగా, ఏపీ అల్లోపతి ప్రైవేట్ హాస్పిటల్స్ ఎస్టాబ్లిస్‌మెంట్ కేర్ అడ్వయిజరీ కమిటీ జిల్లా లీగల్ అడ్వయిజర్‌గా చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసింది. శనివారం బెంగళూరులోని జక్కూర్ ప్రాంతంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేసి సత్కరించింది.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

డోన్ రూరల్: పోస్టాఫీస్‌లో ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని పోస్టాఫీస్‌శాఖ జిల్లా ఎస్పీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చనుగొండ్ల పోస్టాఫీస్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఐపీఓ మౌలేశ్వరరెడ్డి, ఎస్‌పీఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక కేసులకు రాజీ మార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఈశ్వర వెంకట ప్రసాద్



లోక్ అదాలత్‌లో కేసులను విచారిస్తున్న జడ్జి



బనగానపల్లె: లోక్‌అదాలత్‌లో ఇన్‌చార్జ్ జడ్జి రాహుల్ అంబేడ్కర్

డోన్ టౌన్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ కావడంతో 297 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి తంగమని తెలిపారు. అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతితో కలిసి కక్షిదారులను విచారించి కేసులను పరిష్కరించారు. డోన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 41, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11, వెల్దుర్తి 14, ప్యాపిలి 11, రాచర్ల 3, బేతంచెర్ల 19, కృష్ణగిరి 16, జలదుర్గం 8 కేసులను పరిష్కరించినట్లు న్యాయమూర్తులు తెలిపారు. వీటిలో ఐపీసీ 123, ఎంసీ 4, డీవీసీ 1, ఎస్‌ఐ యాక్ట్ 3, ఎక్సైజ్ 1, ఎస్టీసీ 140, పీఎల్‌సీ 4 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో 131 కేసులు పరిష్కారం

కోవెలకుంట్ల: దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న కేసులకు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందని న్యాయమూర్తి ఈశ్వర వెంకట ప్రసాద్ అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజీ ద్వారా 131 కేసులను పరిష్కరించారు. ఇందులో ఎస్టీసీ 91, సీసీలు 28, ఎంసీ, ఎస్‌ఐ యాక్ట్, ఈపీకి సంబంధించి ఒక్కొక్కటి చొప్పున, మూడు ఓఎస్‌లు, పీఎస్‌సీ ఆరు కేసులు రాజీకావడంతో కేసులను కొట్టివేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కేసులకు సంబంధించి రూ. 3.56 లక్షలు కోర్టు ద్వారా వసూలైందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసులు, తిరుపాలు, నరసింహ, ఓబులేసు, విష్ణుమనోహర్‌రెడ్డి, తిరుపతయ్య, రాజశేఖర్, నాగశేషు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో 75 కేసులు పరిష్కారం

బనగానపల్లె: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 75 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఇన్‌చార్జ్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో ఐపీసీ 38 కేసులు, సమ్మరీ ట్రైల్ 31, చెక్ బౌన్స్ 3, ఒక డీవీసీ కేసు సహా మొత్తం 75 కేసులను రాజీమార్గంలో పరిష్కరించారు. ఏపీపీ మాధవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుస్సేన్, జాయింట్ సెక్రటరీ అల్లావుద్దీన్, లోక్ అదాలత్ సభ్యుడు రఘురామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు అబ్దుల్‌ఖైర్, మాదవరెడ్డి, యూసఫ్, కృష్ణారెడ్డి, ఆజాం హుస్సేన్, జగన్నాథ్ రెడ్డి, ఇర్ఫాన్ అబ్బాస్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

డోన్ రూరల్: మండల పరిధిలోని ఉడుములపాడు సమీపంలో రెండు ఎకరాల్లో పశువుల మేత కోసమని వేసుకున్న గడ్డిని గుర్తుతెలియని వ్యక్తులు పరుగుల మందు కొట్టి జీసీబీతో నాశనం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు సంగు నాగేశ్వరరెడ్డి, సంగు స్వామిరెడ్డి కోరారు. శనివారం ఉడుములపాడులో నిరసన తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే జైలుకే

డోన్ టౌన్: రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. శనివారం సాయంత్రం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడు భద్రతా నియమాలు పాటించని వాహనదారులను అదుపులోకి తీసుకుని వారిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాల స్థితిగతలపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు. తాగి వాహనం నడపకూడదని.. మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు. ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి ఉన్నారు.



డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న సీఐ

గాడిచెర్ల సేవలు చిరస్మరణీయం



గాడిచెర్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు 141వ జయంతి వేడుకలను కోవెలకుంట్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ గ్రంథాలయాధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక లైబ్రరీ ఆవరణలోని గాడిచెర్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి గాడిచెర్ల ఎంతగానో కృషి చేశారని.. స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, మాజీ సైనిక ఉద్యోగి సహదేవరెడ్డి, శేఖర్, గ్రంథాలయ పాఠకులు నరసింహ, మహేశ్వరరెడ్డి, బాలయ్య, సుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గాడిచెర్లకు నివాళి

డోన్ టౌన్: గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జయంతిని పురస్కరించుకుని కొండపేటలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి వార్డెన్ మధు, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ శనివారం మొక్కలు నాటారు. విద్యార్థులకు వాతావరణ కాలుష్యం, మొక్కల అవసరం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గాడిచెర్ల జీవిత చరిత్రను వివరించారు.

యువత సమాజసేవలో భాగస్వాములు కావాలి

బేతంచెర్ల: యువకులు సమాజ సేవలో భాగస్వాములు కావడం ద్వారా ఆట్టడుగు వారికి అండగా నిలిచిన వారవుతారని నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మద్దిలేటి, వైద్యుడు చంద్రశేఖర్ అన్నారు. అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్, ప్రథమ చికిత్స గురించి వివరించారు. రెడ్‌క్రాస్ సభ్యుడు నాగ సురేంద్ర, వీర, వైద్యులు వరప్రసాద్, రామాంజనేయులు, మహేష్, బాలకృష్ణ, జయరాముడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు చంద్రశేఖర్

ఘనంగా హిందీ దివస్

డోన్: జాతీయ అధికార భాష ప్రాముఖ్యత, ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్క విద్యార్థి హిందీ భాషలో ప్రావీణ్యం సంపాదించాలని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గీత అన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందీ భాషను చులకనగా చూడరాదన్నారు. భాషలో మంచి పట్టు సాధించగలిగితే దేశంలో ఏమూలనైనా ఉపాధి మెండుగా ఉండే అవకాశం ఉందన్నారు. హిందీ భాష అనర్గలంగా మాట్లాడగలిగితే దేశంలోని ప్రముఖ కంపెనీల్లో అత్యున్నత పదవులు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు హిందీ భాషను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, హిందీ ఉపాధ్యాయులు కల్పన, సునీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గీతా

సీతారాం మృతికి నివాళి

బనగానపల్లె రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని ఆ పార్టీ బనగానపల్లె డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి ఎల్లయ్య అన్నారు. శనివారం స్థానిక పాండురంగస్వామి దేవాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి ఎంపీగా అనేక సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తారని తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు పరిశోధనలకు ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. సీపీఎం నాయకులు లక్ష్మణ్, దస్తగిరి హాజీపీరా, సిద్ధయ్య పాల్గొన్నారు.

పాతాళానికి చేరిన గంగమ్మ



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యవసాయ బోరులో నుంచి వస్తున్న నీటిని చూస్తేనే తెలిసిపోతుంది.. గంగమ్మ పాతాళానికి చేరుకుందని. కొలిమిగుండ్ల మండలం కోర్నపల్లెకు చెందిన రైతు నారాయణరెడ్డి నాలుగు ఎకరాల్లో నెలన్నర క్రితం జొన్న సాగు చేశాడు. మొదట్లో బోరులో నుంచి నీరు సమృద్ధిగా వచ్చేది. వర్షాలు ముఖం చాటేయడంతో భూగర్భ జలాలు రోజు రోజుకు పడిపోయాయి. ప్రస్తుతం బోరులో నుంచి తాగునీటి కొళాయి తరహాలో వస్తుండడంతో పంటను ఎలా దక్కించుకోవాలో దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. ఈ పరిస్థితి కోర్నపల్లె, అబ్దులాపురం, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె తదితర గ్రామాల రైతులు ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతోనే బోర్లలో నీళ్లు అడుగంటిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం, పది రోజుల వ్యవధిలో 60 శాతం బోర్లు పూర్తిగా ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

–కొలిమిగుండ్ల

వర్షం కోసం అఖండ భజన



వీధుల్లో భజన చేస్తున్న బృందం సభ్యులు

కొలిమిగుండ్ల: పెట్నికోటలో వర్షం కోసం శనివారం గ్రామ పెద్దలు, రైతులు అఖండ భజన చేశారు. ముందుగా రామాలయంలో పూజారి గిరిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి పెట్నికోట, కొండమీదపల్లె, గొర్విమానుపల్లె, అవుకు మండలం ఉప్పలపాడుకు చెందిన భజన బృందాలు గ్రామ వీధుల్లో సంకీర్తనలు ఆలపిస్తూ బిందెలతో నీళ్లు పోసుకుంటూ ఆలయాల్లో పూజలు నిర్వహించాయి. రెండు రోజుల పాటు నిరంతరాయంగా అఖండ భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామాల్లో వర్షాలు లేక తీవ్రమైన నీటి ఎద్దడి పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వరుణుడు కరుణించాలనే ఉద్దేశంతో ఇటీవలే బుష్యశృంగుడికి 1001 బిందెలతో జలాభిషేకం చేశామని గుర్తు చేశారు. పెద్దల కాలంలో సకాలంలో వర్షాలు కురవకపోతే ఈ పద్ధతులను పాటించేవారని తెలిపారు.

రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ నర్సుల నిరసన



డోన్ ప్రభుత్వాస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న నర్సులు

డోన్ టౌన్: ప్రభుత్వాస్పత్రుల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు కోరారు. శనివారం స్థానిక వంద పడకల ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఎన్‌ఎం, బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్ చేసి ఏళ్ల తరబడి కంట్రాక్టు పద్ధతిలో నర్సులుగా పని చేస్తున్న తమను విస్మరించి ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా గుర్తిస్తూ జీఓ నెంబర్ 115ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్థానాల్లో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేస్తే తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి జీఓ నంబరు 115ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్ కాంతుల్లో జెండాపేట మసీదు



విద్యుత్ కాంతుల్లో జెండాపేట మసీదు

బేతంచెర్ల: మిలాద్–ఉన్–నబీని పురస్కరించుకుని పట్టణంలోని జెండాపేట మసీదును విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శనివారం రాత్రి గంధం సమర్పించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ర్యాలీ, రాత్రి ప్రవక్త జీవిత చరిత్ర గురించి ధార్మిక సభ నిర్వహించనున్నట్లు మండల ఖాజీ నూర్ అహ్మద్ తెలిపారు.